## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో చండీ హోమం

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### అనాథ వృద్ధురాలికి ఆశ్రయం

**కాశినాయన :** మండలంలోని వరికుంట్ల ఎస్టీ కాలనీకి చెందిన లక్షుమ్మ అనే అనాథ వృద్ధురాలికి వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి ఆశ్రయం కల్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నిరుపేద అయిన లక్షుమ్మ భర్త మృతి చెందారని తెలిపారు. బంధువులు కూడా లేకపోవడంతో ఉండటానికి, తినడానికి ఆమె అవస్థలు పడుతుండేదని, విషయాన్ని కాలనీ వాసులు తన దృష్టికి తెచ్చారన్నారు. దీంతో కాలనీకి వెళ్లి ఆమెను తీసుకొచ్చి ఆశ్రమంలో ఆశ్రయం కల్పించామన్నారు.

### సత్కారం



ఎమ్మెల్సీని సత్కరిస్తున్న నాయకులు

**అట్లూరు :** వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్‌గా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి నియమితులైన సందర్భంగా పోరుమామిళ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీని వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి శాలువా కప్పి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు గుర్రంపాటి సుందర రామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, రాష్ట్ర బూత్ కన్వీనర్ల విభాగం ప్రధాన కార్యదర్శి ఈగ యద్దారెడ్డి, నాగేశ్వరరావు, రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు బంగారు శీనయ్య, డాక్టర్ దాసరి శ్రీను, ఆలా చెంచయ్య, లక్ష్మిరెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఎం.రామచంద్రారెడ్డి, పోలిరెడ్డి, కౌన్సిలర్ ఆరెల్ల రెడ్డయ్య, మాచుపల్లి రజనీకాంత్, బెల్లం సుబ్బారెడ్డి, బండి వెంకటసుబ్బయ్య, శివరామకృష్ణయ్య, వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ రమణారెడ్డి, మల్లేష్, వెంకటసుబ్బారెడ్డి, నారపురెడ్డి నరసింహారెడ్డి, పల్లెం రవికుమార్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఖాదర్‌ఖాన్, శివోటి రెడ్డి, ప్రతాప్, ఈటె మల్లిఖార్జున, గొత్తల వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

### నివాళి

**బి.కోడూరు :** మండలంలోని మేకవారిపల్లె గ్రామానికి చెందిన మాజీ మండల ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సిద్దు బాలసుబ్బారెడ్డి రెండవ కుమారుడైన సిద్దు వెంకటరమణారెడ్డి సోమవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన మేకవారిపల్లెలో చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నియోజకర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు యోగానందరెడ్డి, ప్రభలవీడు సర్పంచ్ జయరామిరెడ్డిలు మంగళవారం గ్రామానికి చేరుకొని వెంకటరమణారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

### భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

**గోపవరం :** మండలంలోని బేతాయపల్లెలో వ్యవసాయాధికారి విజయరావు ఆధ్వర్యంలో బుధవారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయాధికారిణి పద్మజ మట్టినమూనాల సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఓబయ్య, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి

**పోరుమామిళ్ల :** కూటమి ప్రభుత్వం 8 గంటల పనిని 13 గంటలకు పెంచడం దుర్మార్గమని, కార్మికుల ప్రాణత్యాగంతో సాధించుకున్న 8 గంటల పనిని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భైరవప్రసాద్ పేర్కొన్నారు. దీనిని నిరసిస్తూ మంగళవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో గౌసియాబేగం, రవి, రాజు, ఓబులయ్య, ఓబులమ్మ, లక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

### జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఉపయోగం లేదు

**ప్రొద్దుటూరు :** జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, మనోహర్ తెలిపారు. స్థానిక మహిళా శక్తి భవనంలో మంగళవారం సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడో సారి అధికారం చేపట్టిన బీజేపీ మతతత్వాన్ని పెంచి పోషిస్తోందని విమర్శించారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందని, రాబోయే రోజుల్లో ఆర్థిక మాంద్యం ఏర్పడుతుందని, దానిని దృష్టిలోపెట్టుకుని జీఎస్టీని తగ్గిస్తున్నారని పేర్కొన్నారు.

# జగన్ పెట్టిన పథకాలకే పేర్లు మార్చారు

- ప్రొద్దుటూరులో 8వేల ఆటోలు ఉండగా 1562 మందికి మాత్రమే డబ్బు వేశారు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

**ప్రొద్దుటూరు :** ప్రజలను పేదరికం నుంచి బయటికి తేవాలి, సంక్షేమానికి తోడ్పడాలనే లక్ష్యంతో నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి, తర్వాత వైఎస్ జగన్‌లు పరిపాలన చేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇందుకు భిన్నంగా పరిపాలన చేస్తున్నారన్నారు. మంగళవారం తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాడు వైఎస్, జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు నేడు చంద్రబాబు పేర్లు మార్చారన్నారు. అమ్మ ఒడికి తల్లికి వందనం, రైతు భరోసా పథకానికి అన్నదాత సుఖీభవ, ఆరోగ్యశ్రీకి ఎన్టీఆర్ వైద్య సేవ, స్వేచ్ఛకు బాలికా రక్ష పేరు పెట్టారన్నారు. సంక్షేమ పథకాలన్నిటిని ఈ ప్రభుత్వం కాపీ కొట్టిందన్నారు. జగన్ హయాంలో ప్రవేశపెట్టిన వాహన మిత్ర పథకానికి ఆటో కార్మికుల సేవలో అని పేరు పెట్టి వారిని మోసం చేశారన్నారు. ప్రొద్దుటూరులో 8వేల ఆటోలు ఉండగా కేవలం 1562 ఆటోలకు మాత్రమే డబ్బు జమ చేశారన్నారు. దీనికి రాష్ట్రమంతా కూటమి నాయకులు ఖాకి చొక్కాలు ధరించి హంగామా చేశారన్నారు.

**బాబు విజయానికి పంచ సూత్రాలు..**

చంద్రబాబు ఎన్నికల్లో తన విజయానికి పంచ సూత్రాలు అమలు చేస్తున్నారని రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. నమ్మిన వారిని వెన్నుపోటు పొడవడం, దేశంలోని రాజకీయ పార్టీలను ఒకటిగా చేసి వాడుకోవడం జరుగుతోందన్నారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐలతో గతంలో పొత్తు పెట్టుకున్నారన్నారు. కుల విభజన చేసి తన సామాజిక వర్గాన్ని ఉపయోగించుకోవడం జరుగుతోందన్నారు. తాను చెప్పిన అబద్ధాలనే హామీలుగా చంద్రబాబు ప్రచారం చేస్తారని, అవి నిజమన్నట్లు పచ్చ పత్రికలు రాస్తాయన్నారు. జగన్ ఎవరితో పొత్తు పెట్టుకోలేదని, సింహం సింగిల్‌గానే ఉంటుందన్నారు. పందులే గుంపుగా వస్తాయని వ్యంగ్యంగా అన్నారు. ప్రజా సంక్షేమం కోసమే జగన్ తన ప్రభుత్వంలో రూ.3లక్షల కోట్లను నేరుగా ప్రజలకు అందించారని, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారని తెలిపారు. చేసేవి మాత్రమే జగన్ చెబుతారన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు తెచ్చి అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో చెప్పిన చంద్రబాబు మొలకలచెరువులోలాగే సారా తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, బలిమిడి వెంకటలక్ష్మి, ప్రొద్దుటూరు కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు తుపాకుల వెంకటరమణ, చౌడం రవిచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం వల్లే రహదారిపై నీళ్లు



వర్షం నీటిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

**మైదుకూరు :** మున్సిపల్, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతోనే పట్టణంలోని బద్వేలు రోడ్డుపై నీరు ప్రవహిస్తోందని సీపీఎం నాయకులు ఆరోపించారు. బద్వేలు రోడ్డులోని పొట్టి శ్రీరాములు (మార్కెట్) కూడలిలో సోమవారం నుంచి వర్షపు నీరు ప్రవహిస్తుండటంపై సీపీఎం నాయకులు అధికారులపై మండిపడ్డారు. వర్షపు నీటిలో నిలబడి మంగళవారం సీపీఎం నాయకులు అధికారుల తీరుపై నిరసన తెలిపారు. వంకలు, వాగులు, మురుగు నీటి కాలువలపై ఒక వైపు మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపించారు. మరో వైపు అక్టోబర్‌లో వర్షాలు కురుస్తాయని తెలిసినా ఇరిగేషన్ అధికారులు ఎర్ర చెరువును తెలుగుగంగ నీటితో నింపారని, సోమవారం కురిసిన భారీ వర్షంతో చెరువు నిండి అలుగు పారిందన్నారు. అలుగు వంక ఆక్రమణలకు గురికావడంతో అలుగు నీరు వెళ్లే మార్గం లేక జాతీయ రహదారిపై ఉన్న పొట్టిశ్రీరాములు కూడలి పరిసర వీధుల్లోని ఇళ్లలోకి నీరు చొచ్చుకుపోయిందన్నారు. ఇప్పటికైనా అలుగు వంక ఆక్రమణలు తొలగించి అలుగు నీరు పారేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి షరీఫ్, నాయకులు గురవయ్య, జహంగీర్ బాషా, హుస్సేన్, శివయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని మురుగు నీటి కాలువల్లో పూడిక తీయించాలని కోరారు. రెండు రోజులుగా వర్షం నీరు పలు వీధుల్లో నిల్వ ఉందని, ఆ కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## కూటమి ప్రభుత్వంలో రైతులకు మిగిలేది కన్నీరే



ఉల్లి పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

**మైదుకూరు :** కూటమి ప్రభుత్వంలో రైతాంగానికి మిగిలేది కన్నీరేనని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగుచేసిన ఉల్లి పంటను పరిశీలించారు. మంగళవారం మండలంలోని అక్కులాయపల్లె, కృష్ణాపురం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల్లో ఉల్లి పంటను పరిశీలించిన రఘురామిరెడ్డి రైతులతో మాట్లాడారు. మైదుకూరు ప్రాంతంలో ఉల్లి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటాలకు రూ.1200 చెల్లిస్తామని జిల్లా అధికారులు ప్రకటించారని, ఉల్లి కొనుగోలు కేంద్రాలు ఎక్కడ పెట్టారో చెప్పాలని అన్నారు.

## ఆర్టీసీ పెట్రోలు బంకు స్థలం పరిశీలన



పెట్రోల్ బంకు స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్

**మైదుకూరు :** పట్టణంలోని కడప రోడ్డులో ఆర్టీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంకును మంగళవారం తహసీల్దార్ రాసింహ నరేంద్ర, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి పరిశీలించారు. పెట్రోల్ బంకును, పక్కనే ఉన్న అలుగు వంక స్థలాన్ని ఆక్రమించి కట్టారని స్థానిక రైతు నాయకుడు, బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ ప్రతాప్‌రెడ్డి లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు గతంలో అధికారులు పలుమార్లు పరిశీలించి కొలతలు వేసిన విషయం తెలిసిందే. మంగళవారం పెట్రోల్ బంకును పరిశీలించిన తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ తక్షణమే వంక స్థలం ఆక్రమణను తొలగించి మున్సిపల్ నిబంధనల మేరకు వంక మార్జిన్‌ను వదలాలని ఆర్టీసీ డీపో మేనేజర్ శ్రీలతకు స్పష్టం చేశారు. అదే సమయంలో అక్కడున్న బీపీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ వంక స్థలం ఆక్రమణ గురించి తాను చేసిన ఫిర్యాదుపై లోకాయుక్తలో నవంబర్ 7న వాయిదా ఉందని తెలిపారు.

## కస్తూర్బా పాఠశాలకు స్వచ్ఛాంధ్ర పురస్కారం



కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న ప్రత్యేక అధికారి మల్లీశ్వరి

**దువ్వూరు :** మండల పరిధిలోని పుల్లారెడ్డిపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు స్వచ్ఛాంధ్ర పురస్కారం లభించింది. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సభా భవనంలో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేతుల మీదుగా పాఠశాల ప్రత్యేక అధికారి మల్లీశ్వరి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర పురస్కారం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

## రంగసముద్రం పంచాయతీకి మూడు అవార్డులు

**పోరుమామిళ్ల :** స్వచ్ఛ ఆంధ్ర – 2025 కార్యక్రమంలో 3 జిల్లా అవార్డులు రంగసముద్రం పంచాయతీకి లభించాయి. జిల్లా ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా రంగసముద్రం తరపున సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి మంగళవారం కలెక్టర్ శ్రీధర్ నుండి అవార్డు అందుకున్నారు. జిల్లా ఉత్తమ హరిత రాయబారిగా మణిరత్నం, జిల్లా ఉత్తమ స్వచ్ఛ అంగన్వాడీ కేంద్రం అవార్డును విజయజ్యోతి కలెక్టర్ నుండి అందుకున్నారు.

## ఎన్‌సీసీతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం



ఎంపికైన విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారులు

**బద్వేలు అర్బన్ :** ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్య సాహసాలు పెంపొందుతాయని ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ అధికారులు కల్నల్ ఎన్.సూర్యనారాయణ, లెఫ్టినెంట్ కల్నల్ లలిత్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఎన్‌సీసీ ఆర్మీవింగ్ విభాగానికి ఫిజికల్, మెడికల్ పరీక్షల ఆధారంగా 40 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవతో పాటు దేశ సేవ చేయాలనుకునే వారికి ఎన్‌సీసీ విభాగం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ రాచపూడి వెంకటసాయికృష్ణ, ఎన్‌సీసీ ఆర్మీవింగ్ సుబేదారులు అనిల్‌కుమార్, రూపేంద్రజిత్‌సింగ్, కళాశాల ఎన్‌సీసీ ఏఎన్‌ఓ లెఫ్టినెంట్ బాలఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా పరిచయాలను నమ్మవద్దు

**మైదుకూరు :** సోషల్ మీడియాలో పరిచయం అయ్యే అపరిచిత వ్యక్తుల పరిచయాలను, వారి స్నేహాన్ని నమ్మ వద్దని మైదుకూరు అర్బన్ సీఐ కె.రమణారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో విద్యార్థినులకు సోషల్ మీడియా పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ మాట్లాడుతూ ఇంటర్నెట్, మొబైల్ ఫోన్‌లను విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు, చదువుకు సంబంధించిన పరిజ్ఞానాన్ని సంపాదించేందుకు మాత్రమే వినియోగించాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా పరిచయం అయ్యే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాంటి పరిచయాలు నిజమైనవి కావని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

## టీడీపీ నాయకుల ఆరోపణలు అవాస్తవం

**పోరుమామిళ్ల :** తనకు రూ.5 లక్షల కాంట్రాక్టు ఇస్తే రూ.50 వేలకు అమ్ముకున్నానని టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తమని జనసేన నాయకుడు శీలంశెట్టి లక్షుమయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన గాంధీ విగ్రహం వద్ద మాట్లాడుతూ ప్రజా సమస్యలు లేవనెత్తుతున్న తనపై టీడీపీ నాయకులు పనిగట్టుకొని ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు. తనకు ఎటువంటి పనులు తీసుకోలేదని, అలానే ఎవరికి ఇవ్వలేదని చెప్పారు. తనపై చేసిన ఆరోపణలు నిరూపిస్తే ముక్కును నేలకు రాస్తానని సవాల్ విసిరారు. జనసేన నాయకులు వెంకటసుబ్బయ్య, రామ్మోహన్, సిద్దయ్య, ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

## నేడు డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

**గోపవరం :** పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను బుధవారం బేతాయపల్లె గ్రామ పంచాయతీ పి.పి.కుంటలో ఆవిష్కరించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చల్లా రవిచంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొని క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

## ఉచిత కంటి పరీక్షలు వినియోగించుకోవాలి

**ప్రొద్దుటూరు :** స్థానిక గాంధీ రోడ్డు స్టేట్ బ్యాంక్ పక్కనున్న రోటరీ కంటి ఆస్పత్రిలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు రోటరీ కంటి ఆస్పత్రి ప్రెసిడెంట్ కోటా శివకుమార్, సెక్రటరీ ఎంవీఎస్ ప్రభు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోటరీ సర్వీస్ కాంప్లెక్స్ ట్రస్ట్ సౌజన్యంతో అనుభవజ్ఞులైన ఇద్దరు ఫ్యాకో సర్జన్లు, అధునాతనమైన ఆపరేషన్ థియేటర్, 20 మంది సిబ్బంది కంటి వైద్య సేవలు అందిస్తున్నట్లు వారు వివరించారు. మధుమేహ గ్రస్తులు, 60 ఏళ్లపైబడిన వారందరికి ప్రతి శుక్ర, శనివారాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు ఫోన్ నంబర్ 08564 247012, సెల్ నంబర్ 6303448294 సంప్రదించాలని కోరారు.

## ఆర్థిక ప్రణాళికలు అవసరం

**మైదుకూరు :** జీవితం సుస్థిరంగా అభివృద్ధి చెందాలంటే ఆర్థిక ప్రణాళికలు అవసరమని ఆర్‌బీఐ ట్రెనింగ్ కౌన్సిలర్ పి.ప్రవీణ్ కుమార్ తెలిపారు. మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని సూచించారు. బ్యాంకులు అందించే వివిధ రకాల పెట్టుబడి అవకాశాలు, సేవింగ్ పథకాలు, సైబర్ భద్రత, ఆర్థిక మోసాలు - నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు చెన్నరాయుడు, శ్రీనివాసులు, శివకృష్ణ పాల్గొన్నారు.

### వ్యవసాయ విస్తరణ అధికారిగా రామ్‌చరణ్

**దువ్వూరు :** మండల వ్యవసాయ విస్తరణ అధికారిగా నీలం రామ్‌చరణ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రామ్‌చరణ్ దువ్వూరుకు వ్యవసాయ శాఖ సహాయకుడిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొంది మాచనపల్లె క్లస్టర్‌కు వ్యవసాయ విస్తరణ అధికారిగా విధుల్లో చేరారు.

### చర్చి నిర్మాణానికి సహకరించండి

**కాశినాయన :** మండలంలోని అమగంపల్లి విచారణ పెద్దచర్చి శిథిలావస్థకు చేరిందని, దాని స్థానంలో నూతన చర్చి నిర్మాణం చేపట్టదలచామని, నిర్మాణానికి దాతలు సహకారం అందించాలని కడప డయాసిస్ బిషప్ డాక్టర్ సగినాల పాల్ ప్రకాష్ తెలిపారు. మంగళవారం మండలంలోని అమగంపల్లి చర్చిలో ఓ భవనాన్ని ఆయన ప్రారంభించారు.

## సుప్రీంకోర్టు సీజేఐపై దాడి హేయమైన చర్య



బద్వేలు అర్బన్ : అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి రమణయ్య

**బద్వేలు అర్బన్ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని, ఇందుకు కారకుడైన మతోన్మాద అడ్వకేట్ రాకేష్‌కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జకరయ్య, అనిల్, రామరాజు, జయరామరాజు, విజయరావు, శివరామ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**సీపీఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో**

సుప్రీంకోర్టు సీజేఐ బి.ఆర్.గవాయ్‌పై మతోన్మాద అడ్వకేట్ రాకేష్‌కిశోర్ దాడికి యత్నించడం దుర్మార్గమైన చర్య అని కెవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండిజకరయ్య, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఎం ప్రజా సంఘాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మస్తాన్ షరీఫ్, చేతివృత్తిదారుల సంఘం నాయకుడు సుబ్బరాయుడు, సీనియర్ దళిత నాయకులు కేశవయ్య, పిచ్చయ్య, శిఖామణి, నారాయణ తదితరులు పాల్గొన్నారు. అలానే చేతివృత్తిదారుల సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నాగార్జున ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన తెలిపారు. దళితుడు, బౌద్ధ మతస్తుడైన సీజేఐపై జరిగిన దాడి దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి అగ్రవర్ణాలు, ఇతర మతస్తులు చేసిన కుట్రలో భాగమే వారు ఆరోపించారు.

**సీజేఐపై దాడి హేయం**

**అట్లూరు :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ (భూషణ్ రామకృష్ణ గవాయ్)పై జరిగిన దాడిని సీపీఎం ఖండిస్తోందని, సీజేఐపై దాడిచేసిన అడ్వకేట్ రాకేష్ కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి ఇ.రమణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అట్లూరు సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో అత్యున్నతమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి సహించరానిదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయబద్ధంగా రాజ్యాంగపరంగా తీర్పులిస్తున్న సుప్రీంకోర్టు సీజేఐపై దాడి చేసి బెదిరించడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు.

**బీఆర్ గవాయ్‌ను అవమానించడం బాధాకరం**

**పోరుమామిళ్ల :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసరడం బాధాకరమని, న్యాయస్థానంలో అలా జరగడం సరైన పద్ధతి కాదని మానవ హక్కుల సంఘం చీఫ్ గంగన్న, కార్యదర్శి ఫణిరావు అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఒక దళితుడు సర్వోన్నత న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తిగా ఉండటం దేశానికి గర్వకారణమన్నారు.

**అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన**

**ప్రొద్దుటూరు :** సుప్రీంకోర్టు జడ్జి బీఆర్ గవాయిపై న్యాయవాది రాకేష్‌కిశోర్ చెప్పు విసరడం గర్హణీయమని మాలమహానాడు రామాజీ వర్గం జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ తెలిపారు. ఈ దాడికి నిరసనగా మంగళవారం సాయంత్రం స్థానిక పాత మార్కెట్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

## సీనియర్ న్యాయవాది మృతి



సింగంరెడ్డి కృష్ణారెడ్డి (ఫైల్)

**ప్రొద్దుటూరు :** ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది సింగంరెడ్డి కృష్ణారెడ్డి(95) మంగళవారం మధ్యాహ్నం మరణించారు. 1933 జూలై 1న జన్మించిన ఆయన చెన్నైలో బీఎల్ పూర్తి చేశారు. న్యాయవాది వృత్తిలో 60 ఏళ్ల పూర్తి చేసుకున్న ఆయనను గతంలో ప్రొద్దుటూరు బార్ అసోసియేషన్ తరపున సన్మానించారు. విషయం తెలుసుకున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. బుధవారం ఉదయం ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఈసీ మెంబర్ డాక్టర్ టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.